## నారాయణమూర్తి తాతా



# నైజం

కొత్త అమావాస్య వస్తోందంటే చాలు, సీతపల్లి.. గడిబాపనమ్మ గుడిదగ్గర బోలెడంత హడావుడి. ఇంకెంత... కొత్త అమావాస్య నాలుగు రోజులే ఉంది.

"ఏదో అమ్మోరి దయవల్ల ఈ బతుకులు ఇలా హాయిగా ఎల్లిపోతన్నాయి!" పదోసారి అంది కాంతమ్మ. తను అప్పటికే ఓ డోకుడు కల్లు పట్టించి ఉంది. కోడి కాలు నంజుతూ మరో డోకు అందుకుంది. "కొత్తమాస వత్తందంటే సాలు మా దొరకు పొద్దనేది తెల్వదు!" అంటూ నాగన్న దొర గురించి చెప్పడం మొదలుపెట్టింది.

"ఆడు రోజంతా ఆ తల్లి గుడికాడే! సీకట్న తాడి దిగింది మొదలు రేతిరి పొద్దోయే దాకా ఆడనే వుంటాడు. కొత్తమాసకు ఎన్నెన్ని కోళ్లు, గొర్రెలు, బర్రెలు, మేకపోతులు అమ్మోరి నైవేద్దానికి వత్తయో నెక్క నేదు. మా దొరొక్కడే ఆడి సేతుల మీదుగా ఆటిని అమ్మోరికి నైవేద్దం పెడతాడు. ఆడి కత్తికి ఎదురే నేదు. మా కూటికి నోటూ నేదు. ఎల్లీ బస్సు, వచ్చీ బస్సు ఏటి... లారీలు, సిన్నకార్లు, కూటర్లు, ఒకటేటి ... ఏదైనా ఆగి అమ్మోరికి మొక్కాల్సిందే. ఆ సంపాదన సాలు. మేం కూకుని తింటానికి. సల్లని తల్లి. నైవేద్దం మా దొర సేతుల మీ దందుకోందే ఆ తల్లికి కడుపే నిండదు!" అలా కాంతమ్మ వాక్ప్రవాహం సీతపల్లి వాగులా అడ్డూ, ఆపూ లేకుండా సాగిపోతోంది. చుట్టపు చూపుగా వచ్చిన సక్కుబాయి మాత్రం, కల్లు ఫుల్లుగా పట్టించిందేమో, మత్తుగా వాలిపోయి ఊఁ కొట్టడం ఎప్పుడో మానేసింది.

అమ్మోరి పందిళ్లకు తాటాకు కట్టించి, గోవ తీసి మడ తొక్కసాగాడు నాగన్న దొర. గోవ తీస్తుంటే ఏ పరాకునున్నాడో గరికమ్మ కాలిని కసక్కన గీసుకుంది. "నీయమ్మ... నీకు తాగడానికి నా రత్తమే కావలసి వచ్చినాదంటే?" అంటూ కాలికి రక్తం కారకుండా తాటి పువ్వారం అద్ది, తన పని తిరిగి చేసుకోసాగాడు. పని పూర్తి అయిన తరువాత వెంకన్న దొరతో చెప్పాడు "మాపటేలకి పందిర్లైపోవాల! రేతిరి కొండకు పోతే కావలసిన



బడితెలు, కంప నరకొచ్చు!"

తలూపాడు వెంకన్న దొర.

అర్ధరాత్రి తనవాళ్లతో అడవికి బయలుదేరిన నాగన్న దొర మధ్యాహ్నం అయ్యేసరికి కావలసిన గుంజలు, వెదురుకంప నరికించాడు. పొద్దుగూకే సరికి గుంజలు పాతటం పూర్తయింది. వెదుళ్లు పరచి డొక్కతాళ్లతో బిగించి కట్టారు. ఇంక తాటాకు పని మిగిలిపోయింది. "ఓ డొక్కు కల్లు వేత్తే మాపటికి హాయిగా పనిలోకి దిగొచ్చు!" అనుకుంటూ, ఓ డోకుడు కల్లు పట్టించి నులకమంచంలో నడుం వాల్చేసరికి హాయిగా నిద్ర పట్టేసింది దొరకు.

ఉదయానికి కొద్దిగా నలతగా ఉందనిపించింది దొరకు. కాలు చీముపట్టింది. కొద్దిగా వాచింది. కొత్త అమావాస్య పండుగాయె. కాలుగురించి పట్టించుకుందుకు దొరకు తీరికే లేదు. చేతినిండా గుడి పనులుండిపోయాయి.

అనుకున్న అమావాస్య వచ్చేసింది. పొద్దుటినుంచి రాత్రిదాకా ఊపిరాడని నైవేద్యాలు. రాత్రి అయ్యేసరికి చుట్టుపక్కల గ్రామాలనుంచి ఆనపకాయ డోకుతోనో, వెదురుబొంగుతోనో కల్లు పట్టుకుని వచ్చే జనాలు. ప్రతీ రాత్రి రెండు, మూడు సినిమాలు, బాపనమ్మ గుడి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో. గుడి దగ్గర కూర్చుంటే తెరలన్నీ కనపడుతుంటాయి. గుడిపక్కన తారు రోడ్డు కిరువైపులా పందిళ్లలో రకరకాల మిఠాయికొట్లు, ఫాన్సీ దుకాణాలు, గాజుల కొట్లు, కొబ్బరికాయుల కొట్లు, అరటిపళ్ల కొట్లు ... ఒకటేమిటి అన్నీనూ. గడి బాపనమ్మ గుడి దగ్గర ఈ మూడు రోజులూ 'రాత్రి' మేలుకునే ఉంటుంది. నిద్రపోదు. పొద్దుటినుంచి సాయంకాలం దాకా మాంసం కూరలతో విందు భోజనాలు తయారుచేసుకునేవాళ్లే. కల్లు మత్తు, సినిమా గోల, దుకాణాల సందడి రాత్రికే మొదలవుతుంది.

రోజూ వేటమాంసంతో కాంతమ్మ పని భలే రంజుగా ఉంది. కల్లు డోకులకు కొదవే లేదు. అమ్మోరి సంబరం పూర్తి అయ్యేసరికి, నిద్రకు మొహంవాచిన సీతపల్లికి కనుకుపట్టింది. ఎక్కడి చుట్టాలు అక్కడ సర్దుకున్నారు. మంచాన పడ్డ నాగన్నదొర వారం తిరక్కుండానే కన్నుమూశాడు.

"అమ్మోరికి ఏం పొయ్యేకాలం వచ్చిందో, నా మొగుడే కావలసొచ్చినాడు. ఆడేం పాపం సేసిండు. ఏటా నైవేద్దాలు ఎవ్వడెడతన్నాడు, ఆడ్నే తీసుకుపోవాలా? దీని మొగానికి ఎవుడు నైవేద్దం పెడతాడింక, ఈ అమ్మోరు నాశనమైపోను! దీన్ని పులి నాకా! ఇంతన్నాయం సేసే అమ్మోరిని నా నెక్కడా సూడలేదమ్మో! నా మొగుడ్ని నాకు గాకుండా సేసినాది గందా! దీని జిమ్మడ...! పొద్దంత మానం గుడికాడే ఏడిసినాడు గందా! ఆడి పేణాలు తాగేసింది నాయనో! నా నెట్టా బతికేది నాయనో...!" కాంతమ్మ విలపిస్తోంది. ■


మేనమామ ఇంటికి కాంతారావు చేరుకునేప్పటికి రాత్రి ఎనిమిదిన్నర అయింది. శ్రావణమాసం కావడంవల్ల జోరుగా వాన పడుతున్నది...ఆకాశమే కరిగిపోయి నేలమీదికి జారిపోతున్నదా అన్నట్లు. అమ్మ తనకు వ్రాసి పెట్టిపోయిన ఉత్తరంలో ఇచ్చిన గుర్తుల ప్రకారం ఎవరినీ అడుగవలసిన అవసరం లేకుండానే ఆ వీధి చివరిదాకా వచ్చేశాడు అతడు. గోదావరిగట్టున కుడిచేతివైపు ఆఖరుమేడ ఇదే. ఇంటి ఆవరణలో గేటుకు రెండుప్రక్కలా రెండు కొబ్బరిచెట్లు ఉన్నాయి. మెరుపుల వెలుగులో కనిపిస్తూ, అమ్మ వ్రాసినట్లుగానే....

వేల్పూరి సుభద్రాదేవి నవల

మంచుబొమ్మలు

త్వరలో....